# ప్రవృత్తి

-వియోగి

"పిల్లదాన్ని డాటర్ బాబుకు సూపీవా- ఒళ్ళుకాలి పోతున్నది....నీకేం పట్టదు. ఆ సంఘం సంఘం అంటూ ఊళ్ళో పట్టుకు తిరుగుతున్నావు" మాలచిమి గయ్‌మని మొగుడు రాజయ్యా పైన లేచింది.

రాజయ్య విస్తుపోయాడు.

ఎలెచ్చన్లు వస్తున్నాయి. పల్లెల్లో బోల్డు కోలాహలం! నాయకుల వెంట తిరిగే వాళ్ళకి బోల్డు డబ్బులు - సారా!

రాజయ్యకు ఒక పార్టీ అంటూ లేదు - ఎవరు పిలిస్తే వారెంబట తిరగడం- నాలుగు డబ్బులు సంపాదించుకోవడం-

ఉత్తప్పుడు కూలో - నాలో చేసుకు బతకడం! తాతల నాటి కొంప ఒకటి ఉంది... ఒక ఎకరా పొలం ఉంది.. అది గాక మాలచిమి కూడా పన్లోకి పోతూ ఉంటుంది.

"అదేంటే... ఈ ఊళ్ళో డాట్రున్నాడుగా... సూపకపోయావా?" విసుగ్గా అన్నాడు.

"ఆడు ఇండిసన్లు మూడు చేసిండు గానీ... జోరం తగ్గలేదు - అయినా ఏ రోగం వచ్చినా అవే సూదులు కదా వాడు వేసేది" మాలచిమి చెప్పింది.

అవును. అలానే ఆ ఊళ్ళోవాళ్ళు అనుకుంటారు. నరసరాజు ఆ ఊళ్ళో ప్రాక్టీసుచేస్తున్నాడు. అతను చదివింది ఆయుర్వేదం- ఇచ్చేది ఇంగ్లీషు మందులు.

పేషెంట్ రాగానే పొడుగాటి సూది తీసుకుని పశువులకు గుచ్చినట్లు గుచ్చి- ఓ పెన్సిలిన్ ఇంజక్షన్ - ఓ.బి. కాంప్లెక్సు - ఇంకా ఏ పెరాస్టిమాలో ఏదో ఒకటి మొత్తం మూడు సూదులు గుచ్చుతాడు.

మొదట్లో మాత్రలు ఇచ్చేవాడు. అందుకే పల్లెటూరు జనం కోప్పడి సూది ఎయ్యమనేవారు. నువ్విచ్చింది మాత్రేగా - ఇదిచాల్లే అని అర్థ రూపాయో - రూపాయో పారేసి పోయేవారు.

అందుకని అప్పటినుండి అవసరమున్నా లేకపోయినా - ఓ మూడు సూదులు గుచ్చేస్తాడు నరసరాజు.

ఇవన్నీ రాజయ్యకు తెలీదు కానీ - మూడు సూదులు గుచ్చినా తగ్గలేదంటే... అది పట్టణం తీసుకుపోవలసిన జబ్బుని అతని ఉద్దేశ్యం!

రాజయ్య తన గురువు గురవయ్య దగ్గరకొచ్చి



పైసలడిగి విషయం చెప్పాడు. గురవయ్య ఓ మాదిరి లీడరు - అందుకని తనకు తెల్సినా తెలీకపోయినా అన్నీ తెల్సినట్లే చెబుతాడు.

"సూడూ ఈ ఘాజుగాడు బట్టి యూస్‌లెస్ ఫెలో! వెంటనే కర్నూలుకు తీసుకుపో- అక్కడ కూడా - జనరల్ ఆసుపత్రికి పోమాకు - ప్రైవేట్ డాక్టర్ దగ్గరికిపో... ఆసుపత్రికి పోయావో జలగల్లాగా పట్టిపీడిస్తారు. ప్రైవేట్ డాక్టరైతే వెంటనే తగ్గిస్తాడు.. అతగాడి ఫీజు అతడికి పారేస్తావ్ కాబట్టి, ఇదిగో ఈ ఆరొందలుంచు - నువ్వు చేస్తున్న పనికి అడ్వాన్సుగా ఇస్తున్నాను."

ఎలాగూ మూడు రోజులుగ్గా జొరంగా ఉంది కాబట్టి... మాలచిమిని తీసుకుని పిల్లాణ్ని భుజాన వెసుకుని రెండు గంటలు ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణం చేస్తే ఓ డాక్టర్ పేరు తెలిసింది.

తీరా అక్కడికి చేరుకున్నాక - ఆ డాక్టరు ఇంకారాలేదు. ఓ గం ట నిరీక్షించిన తర్వాత వచ్చాడు కాంపౌండర్‌తో అంతకుముందే బాతాఖానీ వేసుకుని - కాఫీ తాపించి ఉండడంవలన ముందు ఇతగాణ్ణిలోనికి పంపాడు.. చేంతాడు క్యూ ఉన్నా సర్దిచెప్పి.

డాక్టర్ రావు డి.కె. ఓ పదినిముషాలు పరీక్షించాడు. నాలుక చాపమన్నాడు. సుత్తితో పొట్టమీద కొట్టాడు. స్టెత్ చూశాడు. ఇంకా చాలా చేశాడు.

రాజయ్యకు తృప్తి కలిగింది. పోగానే ఇంజషన్లు ఇవ్వకుండా పిల్లదాన్నిపరీక్ష చేస్తున్నందుకు.

"బాగా ముదరిపోయింది... ఇదిగో... ఈ టెస్టులు ఈ పక్కనున్న గోవిందా ల్యాబ్‌లో చేయించి రేపు రిపోర్టులు పట్టుకు రా - " డాక్టరు ఓ బారెడు లిస్టు రాసిచ్చాడు.

"మాదీవూరు కాదండి.. ఇవన్నీ ఈ రాత్రికి అయి పోతాయి?" రాజయ్య అమాయకంగా అడిగాడు..

"తొందరపడితే లాభంలేదయ్యా! రేపటికి కాని రిపోర్టు లు రావు - కావాలంటే లాడ్జి తీసుకో - " విసుక్కున్నాడు.

"సరే! డాక్టర్ బాబు! ఇక్కడే ఉంటాం..." పోబోయాడు.

"నాఫీజు యాభై!" చెప్పాడు తాపీగా రావు డి.కె.

"మళ్ళీ వస్తాం గదా.." రాజయ్యకి అనుమానం వచ్చింది.

"అది రేపటి సంగతి... ఇప్పుడు నాకు అరగంట టైం వేస్టుకాలే... రేపు కన్‌సెషన్ ఉంటుందిలే!" కరుగ్గా చెప్పాడు.

రాజయ్య మాట్లాడకుండా యాభై ఇచ్చి బయటపడ్డాడు. గోవిందా ల్యాబ్‌ను కొంచెం కష్టపడి సందులూ , గొందులూ గాలించి పట్టుకున్నాడు.

'రోడ్డుమీద అన్ని ల్యాబ్‌లు కనిపిస్తున్నా ఈ మారుమూల ల్యాబ్ ఎందుకు రాసినట్లో!' అని ఒకింత ఆశ్చర్యపోయాడు కూడా!

"రండి... రండి... డాక్టర్ రావుగారు పంపారా!" పరమానందం వీర ముగ్గురిని చూడగానే అడిగాడు.

"ఆc! టెస్టులు చేయాలి..." రాజయ్య చీటీ ఇచ్చాడు

"నీకే! బాగున్నావు కదయ్యా!" ఆశ్చర్యంగా అడిగాడు.

"లేదు పిల్లదానికి... ఒసేనూకాలు... భయంలేదు ఇటు చూడూ..." బల్ల మీదకు దించాడు బక్క చిక్కిపోయిన నూకాలును మాలచిమి భుజం నుండి అందుకుని.

"ఏం జబ్బు?" పరమానందం లిస్టు చూసి అడిగాడు.

"జరం...దగ్గు..." చెప్పింది మాలచిమి.

"డబ్బులు తెచ్చారా..." పరమానందం రంగం సిద్ధం చేసుకుంటూ అడిగాడు... ఎందుకైనా మంచిదని.

"ఎంత?" గొంత తడారిపోతూంటే అడిగాడు రాజయ్య.

"రెండొందలు..."

"ఆc! అంతడబ్బే!"

"మరి యక్స్‌రే తియ్యాలి... మూడు రకాల బ్లడ్ టెస్టులు చేయాలి... ఇంకా అవసరమైతే స్కానింగ్ చేయాలి.'

రాజయ్య మాలచిమి వంకచూశాడు. ఆమె అయో మయంగా చూసింది. ఒక్క క్షణం ఆలోచించాడు... పిల్లదానికి జబ్బు తగ్గడం ముఖ్యం.. డబ్బు తగ్గినా ఫర్వాలేదు జేబులో...

అన్నీ తీసుకుని మరునాడు ఉదయం రమ్మన్నాడు పరమానందం. రెండొందలు తీసుకుని రసీదు ఇచ్చాడు కూడా.

లాడ్జీల చుట్టూ తిరిగి ఓ యాభైకి ఓ మాదిరి రూము సంపాదించగలిగాడు. ఆ రాత్రికి ముగ్గురూ తలదాచు కున్నారు అందులో.

మరునాడు రిపోర్టులు తీసుకుని డాక్టర్ రావు డి.కె.కి చూపాడు. ఆయన మళ్ళీ ఓ చేంతాడు అంత మందుల లిస్టురాసి ఓ పాతిక ఫీజు వసూలు చేశాడు.

"వారంలో తగ్గిపోతుంది...ఏం భయంలేదు" అని భుజం తట్టి పంపించాడు. పోయేముందు ఆ మందులు ఫలానా షాపులోనే కొనమని పంపించాడు.

మందుల ఖర్చు ఇంకా రెండొందలయింది జేబులో బస్సు చార్జీలతో తిరుగు ప్రయాణం కట్టాడు. బస్సుదిగి వస్తూంటే నరసరాజు ఎదురొచ్చాడు.

ఎక్కడ నుండి వస్తున్నారని విచారించి కనుక్కున్నాడు.. ఆ రిపోర్టులు.. ఆ మందుల లిస్టు చూశాడు.


"ఏం చేస్తాం! మీ కర్మ నాకు పది రూపాయలు ఇవ్వడానికి ఏడ్చి చస్తారు. అక్కడికిపోయి అయిదొందల దాకా గొరిగించుకున్నారు... ఈ జబ్బుకు ఈ టెస్టు లక్కరలేదు... మందులూ అక్కరలేదు.."

"మరి ఎందుకు ఇచ్చినట్లు..." అర్థంకాక అడిగాడు రాజయ్య.

"కమీషను...కమీషన్ కోసం... టెస్టులో యాభై శాతం కమీషన్... మందుల్లో ఇరవై నుండి ముప్పై శాతం కమీషన్ డాక్టర్‌కు ముడుతుంది. ఇవన్నీ రాయకపోతే ఆ డాక్టర్‌కు డబ్బులొచ్చేదెలా?" నరసరాజు వెటకారంగా నవ్వాడు.

రాజయ్య, మాలచిమి అవాక్కులైపోయారు. అతను చెబుతున్నది నిజమో, అబద్ధమో తలియక!


విజయప్రసాదు కోపల్లి
ఏ.ఏ.ఓ..జీవిత భీమా సంస్థ
పి.బి.నం.11. పార్కురోడ్
మేడం కంపౌండ్
కర్నూలు - 518 001.


కె. భగవాన్‌రెడ్డి, మార్టేరు - 534 122, ప.గో. జిల్లా.